# కనిపించని కోయిల

(గత సంచిక తరువాయి)

మరునాడు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత రేడియోలో పాటలు వింటూ చాలాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు రవీ, అమల. సాయంకాలం కాఫీ తాగుతూ స్టేషను మాష్టరు ఇంటికి వెళ్ళొస్తానన్నాడు రవి తల్లితో. "పాపం, పిల్లా, జెల్లా, ఒంటరి మనిషి ఎలా వేగుతున్నాడో ఏమో!" అంటూ, వెళ్ళబోతున్న రవి చేతికి మామిడిపండ్లు, జామపండ్లువేసిన సంచీ ఇచ్చింది జానకమ్మ బిడ్డలకిచ్చిరమ్మని. 'శ్రీరాములు ఒంటరివాడేమిటి' అన్న సందేహం కల్గినా, బహుశా ఆయన భార్య పుట్టింటికేమయినా వెళ్ళిందేమోనని సరిపెట్టుకుంటూ, ముందుకు నడిచాడు రవి. రేణిపండ్లు తేవడం మరిచిపోకంటూ యింట్లోంచే కేకబెట్టింది అమల. ఒత్తి తిండిపోతు. 'ఇరవై నాలుగ్గంటలూ నోట్లో ఏదో నములుతూ ఉండవలసిందే.' నవ్వుకుంటూ 'సరే' నన్నాడు రవి.

దారిలో చెంగల్రాయుల హోటల్ ముందు జనం గుమిగూడి వుండడం గమనించాడు రవి. గుంపు దగ్గరికెళ్ళి లోనికి తొంగి జూచాడు. చెంగల్రాయులు తనవద్ద జేసిన నలభై రూపాయల అప్పు మొత్తమూ తీర్చేయమని చంద్రబాబుమీద తీవ్రంగా నోరు పారేసుకుంటున్నాడు. నిన్న కాఫీకి పిలిచిన తానే బిల్లు ఇవ్వడంలో చంద్రబాబుకు గల సంస్కారము, చిల్లర లేదేమోనన్న అనుమానంతోనే అయిదురూపాయల నోటును వుంచుకోమనడంలో ఎదుటిమనిషిపై అతనికి గల నమ్మకము, వాటి వెనుక దాగున్న అతని నిజ స్వరూపం అవగతం గావడంతో రవికి మళ్ళీ అక్కడ నిలుచుకో బుద్ధి కాలేదు.

వీధి మలుపులో రవికి మళ్ళీ ఎదురయ్యాడు వడివేలు, సైకిలు నడిపించుకుంటూ, వెనుక సీట్లో తపాలా సంచితో సహా. రవి వాచీకేసి ఈసారి ఒక దొంగ చూపు మాత్రం చూసి ఊరుకున్నాడు వడివేలు.

దారి పొడుగునా తన స్వంతభాషలో వడివేలు ఏదో మాటాడుతూనే వున్నాడు. అన్యమనస్కంగ ఊకొడుతూనే స్టేషన్ దాకా నడచి వచ్చేశాడు రవి.

వెళ్ళేసరికి శ్రీరాములు తలవంచుకుని యథాలాపంగా రిజిష్టర్లు వ్రాసుకుంటూ కన్పించాడు. నలభై గూడా నిండకముందే శ్రీరాములుకు ఎందుకింత నిలకడ అలవడిందో రవి కర్థం కాలేదు. 'మొత్తంమీద నిలకడయిన మనిషి' అనుకున్నాడు రవి. అయిదు నిముషాలు అలాగే నిలబడిచూచినా, శ్రీరాములు తలఎత్తిచూచేట్టు కన్పించలేదు. ఏమవుతుందో చూద్దామని అందుబాటులో వున్న గంటను గణగణ మ్రోగించాడు రవి.

అర్థాంతరంగా వేళగానప్పుడు మ్రోగిన గంటను విని ఉలిక్కిపడకపోగా, అప్పటికేమో వచ్చిన ప్రతివాడూ తనను పలుకరించే విధానమే అదన్నట్టుగా శ్రీరాములు యథాలాపంగా నవ్వేస్తూ "ఏం రవీ, ఆ రోజు వెళ్ళడమేగా. మళ్ళీ ఇప్పటికి తీరిక చిక్కినట్టుంది ఒక్క నిముషం ఉండు. క్వార్టర్సు కెళదాం." అని రిజిష్టర్లను మూసేస్తూ — సూరన్నను ఆఫీసులో వుండమని యింటివైపు నడిచాడు.

ఎందుకో క్వార్టర్సు మరీ బోసిపోయినట్టు కన్పించడంతో రవి అనుమానంగా అడిగాడు. "సార్. ఇక్కడేదో ఒక పెద్ద చెట్టు వుండినట్టు గుర్తు. ఏమయిందది?"

"అవునవును. అది మామిడిచెట్టు. అయితేఏం వింత చెట్టంత ఉండేది. బిచ్చగాళ్ళు ఎప్పుడూ దానికింద పదిమందికి తక్కువ వుండేవారు గాదు." స్వగతంలా చెప్పాడు శ్రీరాములు.

ఇంటి ముందున్న చిన్న తోటంతా బాగా నాశనమయినట్టు వుంది. మళ్ళీ కొత్త చెట్లు నాటడానికి పాదులు త్రవ్వుతూ కన్పించింది వసంతలక్ష్మి.

"వసంత కదూ బాగా పెద్దదయిందే." నవ్వుతూ పలుకరించాడు రవి.

"మీరు ... మీరు అమలావాళ్ళ అన్నగదూ." విస్మయంగా అడిగింది వసంత. తుఫాను తర్వాత కన్పించిన ఆప్తుల్ని ప్రశ్నించినట్టుంది ఆ ప్రశ్న.

అమల, శ్యామల, వసంత చిన్నప్పటినుంచీ మంచి స్నేహితులు. వసంత అందర్లోకి చిన్నది. విపరీతమయిన బిడియంతో ఎవరితోను ఎక్కువగ మాటాడేది గాదు. అయితేనేం — ఆ అమ్మాయి ము మెప్పుడూ ఎంతగా కళకళలాడుతుండేదని! కానీ ఆ ముఖం యి డెందుకో మరీ దయనీయంగా ఉంది.

లోనికెళ్ళేసరికి ఏడాదిపిల్లవాడొకడు దోగాడుతూకన్పించాడు

పండ్లువున్న సంచీని వసంత చేతికిచ్చి, పిల్లాడినెత్తుకుంటు ప్రశ్నించాడు రవి.

"వీడికి పేరేం పెట్టారమ్మా ?"

వసంతకేమీ పాలుపోయినట్టులేదు. రెండుసార్లు గ్రుక్కుళ్లు మింగి "ఇంకా ఏం పేరూ పెట్టలేదన్నా." అంది.

"అదేవిటి సార్. పుట్టి ఏడాదయినా దాటి వుంటుందిగదా! ఇంకా ఎందుకు పేరు పెట్టలేదు ?"

"పెడదాంలే రవీ· నిజానికి ఈ కొత్త సమస్య లేవదీస్తున్నది నీవే. మాకిదింతవరకు గుర్తు రానేలేదు." పేలవంగా నవ్వుతూ అన్నాడు శ్రీరాములు. ఈ వాలకాలు చూస్తున్న కొద్దీ మతి పోతు న్నట్టుగా వుంది రవి పరిస్థితి.

ఇంతలో ఏదో గూడ్స్ అవుట్ అయిందని సూరన్న చెప్ప డంతో శ్రీరాములు రవితో 'మళ్ళీ ఓఅయిదు నిముషాల్లో వచ్చేస్తా' నంటూ స్టేషన్ కేసి నడిచిపోయాడు. సూరన్న వసంత వదిలేసిన పొదులు తీస్తూ యింటి దగ్గరే నిల్చిపోయాడు. స్టవ్ ముట్టించి ఆ మంటలకేసి చూస్తూ కూర్చుంది వసంత ముభావంగా. ఇంతలో రవి చేతిలోని పిల్లవాడు ఏడవడంతో ఆమె లేచివచ్చి వాడ్ని తన చేతి లోకి తీసుకుంది. అయితే వాడు ఏడుపుమానే సూచన ఏదీ కన్పించ లేదు.

రవి నవ్వుతూ "చిన్న పిల్లలను సముదాయించడం నీకేం చేతనవుతుందమ్మా! మీ అమ్మని పిలువు." అన్నాడు టేబిల్ మీదున్న పాత పత్రికను చేతిలోకి తీసుకుంటూ.

వసంత బావురుమంది. పిల్లవాడిని ఏడుపు మాన్పించబోయి అదేవిటి ఈ అమ్మాయి తనే ఏడుస్తోంది. రవికి ఇంటి వాతావరణ మంతా పూర్తిగా మారిపోయినట్టు కన్పించింది.

హాలు గడపదాటి వసారాలోకి వస్తూ సూరన్నతో అన్నాడు రవి

"ఇదేం సూరన్నా! నాకీ యింటి సంగతేం అంతుచిక్కడం లేదు. ఏమిటో క్వార్టర్స్ అంతా ప్రేతకళ కన్పిస్తూవుందే!"

"వసంతమ్మ వాళ్ళమ్మ పోయినప్పట్నించీ యిలానే వుంది బాబా! ఇంతకూ కొడుకును కనిన రెండోనాడే వాయువుగొట్టి ఆయమ్మ బాలింతసావు బడిన సంగతి నీకు తెలవదా ?" నమిలిన పొగాకు నుమిసేస్తూ అన్నాడు సూరన్న.

మామిడిచెట్టు లేకుండా బోసిపోయిన క్వార్టర్సు లైనులా, గృహలక్ష్మి లేకుండా చిన్నబోయిన శ్రీరాముల ఇల్లులా రవి మనసు శూన్యం అయిపోయింది. ఆనాడు మొదలుకుని జరిగిన సంగతులన్నీ వరుసగా ఏకరువు పెట్టసాగాడు సూరన్న.

దుమ్ము కొట్టుకుపోయిన బరువైన పెట్టెలతో, మాసి మొగ్గ కొట్టుకుబోయిన ఇంజనుతో, నానా రభస చేసుకుంటూ గూడ్సు వచ్చి వెళ్ళిపోయింది.

రవి శ్రీరాములు యింటికి వచ్చేలోగా తను యింటికి వెళ్ళి పోవాలనుకున్నాడు. గదిలో కెళ్ళేసరికి పిల్లవాడు సొమ్మసిల్లి నిద్ర పోతున్నాడు ఒక మూలగా. తదేకంగా స్టవ్ మంటలకేసి జూస్తూ కూర్చుని వుంది వసంతలక్ష్మి. ఆమె చెంపలపై జారిన కన్నీటి చారలపై నీలినీలిమంటలు ప్రతిఫలిస్తున్నాయి.

మెల్లగా దగ్గరికెళ్ళి "వెళ్ళొస్తానమ్మా" అన్నాడు రవి.

చటుక్కున తలెత్తి "అదేమన్నా. ఇప్పుడేగా వచ్చావు. టీ అయినా తాగకుండా ఎలా వెడతావు! టీ కొంచెం తాగి వెడుదువు గాని కూచో. అదిగో నాన్న కూడా వచ్చేశారు" అంటూ కొంగుతో ముఖమంతా రుద్దుకుని ముఖంలో చిరునవ్వు పులుముకుంది వసంత.

టాపిక్ మార్చే వుద్దేశంతో "చంద్ర బాబేడి?" అని అడి గాడు రవి అనాలోచితంగా.

చంద్రబాబు పేరు వినడంతోనే వసంత ముఖంలోకి కొత్త కాంతి వచ్చింది. "పేటకొచ్చాడే· బహుశా ఇంటి నుంచీ మీరు సరాసరి యిటే వస్తున్నట్టుంది"అంది. "అవునవును"అని, తాను చెంగల్రాయుల హోటలు ముందు చంద్రబాబును చూసిన దృశ్యాన్ని దాచిపెట్టాడు రవి. ఇంతలో శ్రీరాములు రావడంతో యిద్దరికీ టీ యిచ్చింది వసంత. "నువ్వూ త్రాగవమ్మా" అంటూ తండ్రి చెప్పడంతో తానూ త్రాగుతూ గడపలోకెళ్ళి సూరన్నతో తానువేసే కొత్త తోటను గురించి చెప్పసాగింది వసంత.

"చంద్రబాబు యిక్కడికొచ్చి ఎన్ని రోజులయింది సార్ ?" రవి శ్రీరాముల్నడిగాడు.

"నాలుగు నెలలు అయింది. మనిషి కొంచెం తొందర మంచివాడేననుకో. కాలేజీ ఎలక్షన్సులో తలదూర్చి ఎవరో ఘరానా మనుషులతో తగాదా పెట్టుకున్నాడట. వారేం జేస్తారోనని భయపడి వాళ్ళనాన్న నా దగ్గరకు పంపాడు. ఐతే వీడిక్కడ మహా గడుగ్గాయిగా తయారయ్యాడనుకో. చెప్పేదంతా అబద్ధమే. వీడి అబద్ధాలు నమ్మి మోసపోనివాడు యిప్పటికి ఈ వూర్లో లేడనుకో. ఒక వారం క్రితమే వీణ్ణి పంపేద్దామనుకున్నాను. ఐతే వసంత దీనికి ససేమిరా ఒప్పుకోవడం లేదు. వాడి కోతలన్నీ దీని తలకిబాగా ఎక్కినట్టున్నాయి." అన్నాడు శ్రీరాములు.

ఇంటిముందు సైకిల్ ఆగిన చప్పుడయింది. చంద్రబాబు లోనికొస్తూ యింటిముందు మామిడిమొక్క నాటుతున్న వసంత లక్ష్మిని చూచాడు.

"ఓహో! వసంతలక్ష్మి మాకంద తరువు నాటుతోందన్న మాట. ఇక దానిలో కోయిలగూడా కూయడంతో మన తోట వసంత వనంగా మారిపోనుందిగదా!" అంటూ నాటక ఫక్కీలో మాటా డాడు.

వెలుపలికొస్తూ శ్రీరాములు రవితో అన్నాడు "చూచావా రవీ, వీడి మాటలగరడీ! ఇట్లా మాట్లాడే—వీడు వసంతను మాయ జేశాడు." ఒకక్షణం తర్వాత మళ్ళీ అన్నాడు శ్రీరాములు

"రవీ నీకు గుర్తుందా. హైస్కూల్లో నువ్వు చదివేటప్పుడు రోజూ సాయంత్రం యిక్కడికి వచ్చేవాడివి. అప్పుడు యిక్కడుండిన

మామిడిచెట్లో కోయిల రోజూ కూస్తుండేది. దాన్ని వెతకడం ఎడతెగని పనిగా వుండేది నీకు ఆ రోజుల్లో. అదేం చిత్రమోగాని నేనుగాని, వసంతవాళ్ళ అమ్మగాని నీకు దాన్ని వేలుపెట్టి చూపినా కనిపించేదిగాదు.

నిజానికి రవికదేం గుర్తు రావడంలేదు. కానీ అప్పటికీ యిప్పటికీ తనకిదొక పనిగా మిగిలి వుండడం జూచి నవ్వొచ్చింది.

"ఇంతకూ ఆ చెట్టెందుకు కొట్టేశారుసార్" అన్నాడు రవి.

"బాలింతగా సచ్చి దెయ్యాన్నై చెట్లో చేరిందని లైను లైనంతా దుమారం పుట్టిపోయి ఒకవారం ఎవరూ నిద్రపోలేదు బాబూ! దాంతో సారే దాన్ని కొట్టేయమన్నారు" అంటూ ఆ రోజుకు పని చాలించుకున్నట్టుగా చేతులు దులుపుకున్నాడు సూరన్న.

"అదేంగాదు. వసంత యిక్కడ చెట్టు నాటబోతుండగా కోయిల దీనిపై గాకుండా మరో చెట్టుపై ఎలాకూస్తుందో చూద్దామని మేమే కొట్టించేశాం" చమత్కరించాడు చంద్రబాబు వసంతను ఉడికిస్తూ.

వసంతకు నవ్వీ, నవ్వీ పలకమారింది.

'వసంత చంద్రబాబు వలలోబడి మోసబోదుగదా' రవి సందేహించాడు.

'నో,నో. అలా జరగడానికి వీల్లేదు. శ్రీరాములు తెలిసీ తెలిసీ ఈ మట్టి గుర్రాన్ని నమ్మి వసంతను గోదావర్లో దింపడు' అనుకున్నాడు.

'లోకంలో ఎందరులేరు. ఎవడో వస్తాడు. మళ్ళీ మా యింటికి ఒక క్రొత్త వెలుగును తెస్తాడు వసంతముఖంలో నవ్వులను, వసంత వనంలో పువ్వులను పూయించేవాడు, రెంటినీ అల్లిన కదంబమాల తన మెడలో అలంకరించుకోగలవాడు ఎవడో యిక్కడికి ఎప్పుడో ఒకప్పుడు రానేవస్తాడు'-సంతృప్తికరమయిన ఆలోచనతో రవి యింటిముఖం పట్టాడు.

ఒక అరఫర్లాంగు నడిచి వచ్చేశాక వెనుకనుంచీ పరిగెత్తుకొస్తూ కన్పించింది వసంత. దగ్గరికొచ్చి "అమలకు రేణిపండ్లు దీసుకుపోవడం మరిచిపోయినట్లున్నావుగదన్నా!" అని కొంగువిప్పి పండ్లన్నీ రవి చేతిలో పోసింది.

* * *

ఇంటికొచ్చేసరికి వసారాలో రామనాథం మంచంమీద కూర్చొని పంచాంగం చూసుకుంటున్నాడు.

రవి శబ్దం జేయకుండా యింటిలోనికి పోబోయాడు.

కానీ యింతలో "రవీ. ఇలా ఒకసారిరా" అంటూ తండ్రి పిలవడంతో వెళ్ళి ఎదురుగా అరుగుమీద కూర్చున్నాడు.

"అంతగా చదువుకోవాలనిపిస్తే చెప్పాలిగాని యింతకే పెద్ద ఆగడం చేశావటగా! దగ్గర్లో ఉద్యోగం దొరుకుతుందని మీమామయ్య చెప్పాడు కాబట్టి ఈమాట నీకూ చెప్పాల్సి వచ్చింది. ఎటూ ఇక రెండేళ్ళు రాజాకు యిక్కడే చదువుగదా. ఎం. ఏ. వరకూ మా బాధ్యతగా మేమే చదువు జెప్పిస్తాం, ఆపైన స్కాలర్ షిప్ వచ్చేపక్షంలో నీ రీసర్చికి ఏ అడ్డంకీ వుండదు" అంటూ జెప్పాడు రామనాథం.

రవికి తన ప్రవర్తనపట్ల తనకే సిగ్గువేసింది. పదినిముషాలు మౌనంగా ఆలోచించిం తర్వాత "ఈసారి స్ట్రయికులవల్ల మాకాలేజీ పరీక్షలు లేటుగా జరిగాయిగదా. యూనివర్సిటీలు యింకో నెల రోజుల్లో తెరుస్తారు. రిజల్ట్సు వచ్చేసాక నా కసలు తీరిక ఉండకపోవచ్చు. అక్కడ నాకు బాగా తెలిసిన లెక్చరర్ ఒకాయన ఉన్నాడు. నేను యూనివర్సిటీలో చేరేవిషయం ఆయనతో మాట్లాడివస్తే మంచిది" అంటూ ఆగాడు రవి తండ్రికేసి జూస్తూ.

చెప్పమన్నట్టుగా తలపంకించాడు రామనాథం. "అందుకొకసారి మళ్ళీ నేను పట్నంవెళ్ళి రావల్సి వుంటుంది. ఒకవారంలోనే వెళ్ళి వస్తే మంచిదనుకుంటాను."

"సరేలే. అలాగే వెళ్ళివద్దువుగాని. వెళ్ళేదేదో రేపే వెళ్ళు. మళ్ళీ నాలుగయిదు రోజులు ప్రయాణానికి మంచివికావు" అని లోపలి కెళ్ళిపోయాడు రామనాథం. వచ్చిన నాలుగయిదు రోజులకే మళ్ళీ బయల్దేరుతున్న రవిని జూచి అమల, రాజా చిన్నబోయారు. మళ్ళీ వీలయినంత త్వరగా వస్తానని వాళ్ళను నమ్మించడానికే రవికి ఆ రాత్రంతా సరిపోయింది.

రాత్రి పడుకున్నాక, హాల్లో తండ్రి చాలాసేపు దగ్గుతూ వుండడం విన్న రవి చాల బాధపడ్డాడు. ఆయనకూ వయసు పైబడుతోంది. పిల్లల అభివృద్ధితప్ప తలిదండ్రులకింకే కోరికలుంటాయి? ఎలాగయినా వీలయినంత త్వరగ చదువు ముగించి ఉద్యోగంజేస్తూ తండ్రికి కొంచెం వెసులుబాటు కల్పించాలన్న నిశ్చయానికి వచ్చాడు రవి.

* * *

ఉదయం లేస్తూనే ప్రయాణ సన్నాహంలో పడ్డాడు రవి. ఆరున్నరకే స్నానం ముగించి స్నేహితులకు చెప్పి వస్తానని బయల్దేరిన రవితో, అలాగే గుడికివెళ్ళి రమ్మంది జానకమ్మ.

స్నేహితులెవరూ యింకా లేచివుండరనే ఊహరావడంతో నేరుగా గుడికేసి నడిచాడు.

గుడిగంటలు మ్రోగేశబ్దం వలయాలు వలయాలుగా ఊరు దాటి దూరంగా పారిపోతోంది. ఆలయంలో ఆ రోజు కోదండ రామస్వామివారికి వసంతోత్సవమట. పూజ జేసిన గోపాలకృష్ణమాచారి ప్రసాదం ఇచ్చి రవిమీద పసుపునీళ్ళు చల్లాడు.

ఆచారికింకా ఇరవై దాటలేదు. ఆయన తండ్రి అనంతాచారి బా‌ ముసలివాడయిపోయాడట. మంచంమీంచి కదల్లేడు. సంవత్స రంగా తానే పూజాదికం జేస్తున్నట్టు, యిది తన చేతులమీదుగా జేస్తున్న రెండో వసంతోత్సవమనీ చెప్పాడు కృష్ణమాచారి.

'ఎన్ని వసంతాలు గడచినా భగవంతునికి నిత్యవసంతోత్సవమే గదా.' ఆలోచిస్తూ రవి గుడిముందరి నందనవనంలోకి వచ్చాడు. దూరంగావున్న స్నేహితురాళ్ళను వదలి దగ్గరికొచ్చింది శ్యామల.

''ఈరోజు మళ్ళీ పట్నం వెళుతున్నావటగా!'' గాద్గదికంగా అంది శ్యామల. ఆమెకళ్ళు నందనవనంలో తడిసిన నంది వర్ధనాల్లా వున్నాయి.

''ఎన్నిరోజులు. మళ్ళీ మూడురోజుల్లో వచ్చేయనూ!'' తన గొంతులో ధ్వనించిన విషాదపు జీరకు ఆశ్చర్యపోయాడు రవి.

వీధిలో వస్తుంటే చేతిలో పుస్తకాలు, కారియర్‌తో ఒక పదహారేళ్ళ పిల్లవాడు కన్పించాడు. వడివేలు కొడుకట. దగ్గరికొచ్చి 'టైం ఎంతయిందండీ' అని రవిని అడిగాడు.

''ఏడు'' అన్నాడు రవి, వాచీ జూసి.

''అరే యింతకుముందు నేను మునసబుగారింట్లో జూసి నప్పుడు ఆరే అయిందే. బహుశా అది నిల్చిపోయి వుండచ్చు'' అంటూ వాడు సంతగేటుకేసి పరిగెత్తసాగాడు.

''ఏమిటీ తొందర ? ఎక్కడికి వెళ్తున్నాడు ?'' రవి ప్రక్క నున్న ఆసామిని అడిగాడు.

''రామాపురంలో ఇంటర్ చదువుతున్నాడు నాయనా. ఏడు న్నర పయిన పదింటికిగాని రామాపురానికి ఆర్టీసీ బస్సులేదు. పాపం తెలివైన పిల్లవాడు. కష్టపడి చదువుకుంటున్నాడు.''

'వడివేలు వాచీ కొనాలనుకుంటున్నది వీడి కోసమే కాబోలు! అయ్యో పాపం' అనుకున్నాడు రవి.

మధ్యాహ్నం పదకొండుకు భోంచేసిపడుకున్నాడు రవి, మళ్ళీ రాత్రికి నిద్రపోయే సౌఖ్యం కల్గుతుందో లేదోనని లేచేసరికి గదిలోకి జూస్తూ కన్పించింది శ్యామల. ఆమె ముఖంలో విషాదం కన్పించినా, ఆమె జడలోని కనకాంబరాలన్నీ నాలుగురోజుల వియోగానికే ఇంతగా గాబరాపడుతున్న వాళ్ళను జూచి పగలబడి నవ్వుతున్నాయి.

చిన్న బ్రీఫ్‌కేస్‌తో బయల్దేరాడు రవి. మౌనంగా ప్రతి చర్య మనిస్తున్నారేతప్ప అమల, శ్యామల, రాజా ఏమీ మాట్లాడ్డంలేదు.

శ్యామల తెచ్చిందంటూ టిఫిన్ కారియర్‌లో నుంచి తీసి అన్నుముక్క నొకదాన్ని రవి నోటిలో వుంచింది జానకమ్మ.

'అవునా' అన్నట్టు నవ్వుతూ శ్యామలకేసి చూసాడు రవి.

అంత బాధలోను సిగ్గుతో చూపులు వాల్చేసుకుంది శ్యామల. పెదవుపు నదుపులో పెట్టుకోవడానికి ఆమె క్రిందిపెదవిని మునిపంట నొక్కిపెట్టుతుండడము, బొటనవ్రేలితో నేలమీద రాస్తూవుండడము జూచి రవికి బాధతో బాటు నవ్వుగూడా వచ్చింది.

రవి గడప దిగేసరికి అమల కళ్ళలో నీళ్ళు నిలిచివున్నాయి. రాజా తల్లినానుకుని మూతిముడుచుకుని నిలుచునివున్నాడు. శ్యామల అక్కడ లేదు.

తల్లి 'జాగ్రత్త' అంటూ పదే పదే ఓ ఇరవైసార్లయినా చెప్పి వుంటుంది. ఊరు దాటిం తర్వాత గూడా రామనాథం వచ్చి 'ఏకోర్సు దీసుకొనేదీ జాగ్రత్తగా తెలుసుకు రమ్మని' చెప్పిపోయాడు.

రవి స్టేషన్ చేరేసరికి గంట ఆరు దాటింది. స్టేషన్ మలుపులో నుంచి మర్రిచెట్టు పొకట్, దాని వూడలగుండా కన్పిస్తున్న ఎర్రటి సంజె వెలుగులూ కన్పించాయి. రవికి అది ఒక అద్భుత మయిన దృశ్యంగా గోచరించింది.

నేరుగా చెట్టు కిందికే వెళ్ళి నిల్చున్నాడు రవి. చెట్టు పాత ఆకులను రాల్చుకుని కొత్త చిగురులు వేస్తూంది. లేత ఆకులు సంజె వెలుగులలో లోకానికొక కొత్త భవిష్యత్తును వాగ్దానంచేస్తు న్నట్టుగా వున్నాయి. చెట్టుకిందంతా నేలమీద ఎండుటాకులు రాలి వున్నాయి. కాలు మోపినప్పుడల్లా ఏవో స్మృతులను రేపుతున్నట్టుగా అవి గలగల నలుగుతున్నాయి. ఐతే ఎండుటాకుల మధ్యలో రాలిన కొన్ని లేతఆకులు సైతం లేకపోలేదు. అయితే అవి చాలా తక్కువే అనిపించడం రవికి ఆనందం కల్గించింది. ఆలోచిస్తూ అటువైపుగా వెళ్ళాడు రవి. చెట్టు మొదలేదయితే వుందో అది పూర్తిగా తొర్ర బారిపోయి వుంది. కొంతకాలానికది పూర్తిగా చెదలుబట్టి పోయినా పోవచ్చు. అయితే చెట్టు కాధారంగా ఎన్నో వూడలు దిగి, నేలలో వేళ్ళూనుకుని అవే మొదలంత లావయివున్నాయి. రవి కిదంతా విశ్వ రహస్యంగా వుంది.

ఆలోచనల నీడలలో నడుస్తున్న రవి ఎక్కడో బ్రిడ్జిమీద రైలువస్తున్న చప్పుడు విన్నాడు. దాంతో పరుగెత్తుకెళ్ళి స్టేషన్లో పడ్డాడు. అంతవరకు జేబులో పెట్టుకున్న టికెట్టును తీసి రవి చేతిలోవుంచాడు శ్రీరాములు.

స్టేషన్లో రైలు ఆగిన చప్పుడు. రైలు ఆగమనంతో పైకెగిరిన ఎండుటాకులు రైలు ఆగడంతోనే నేలమీదపడ్డాయి.

పోర్టరు సూరన్న రేణిపండ్ల బుట్టలుంచిన ట్రాలీని త్రోసుకుని బ్రేక్‌వేన్‌కేసి నడిచాడు. పోస్ట్‌మేన్ వడివేలు 'ఆరెమ్మెస్' లోకి తపాలా సంచీని గిరవాటు బెట్టాడు. తినుబండారాలమ్మే పిల్లవాడు కిటికీల గుండా పాసింజర్లతో బేరం సాగిస్తున్నాడు. ఇక్కడొకడూ, అక్కడొకడూ ఒకరిద్దరు బిచ్చగాళ్ళు దిగారు.

రవి రైలెక్కి కూర్చున్నాడు. నిశ్శబ్దం భరించలేనట్టుగా చిన్న కూత వేసింది రైలు. 'సరే నీ యిష్టం' అన్నట్టుగా విజిల్ వేశాడు గార్డు. స్టేషను గంట, చెరువులో బుడుంగున మునిగిపోయే రాయి చేసే శబ్దంలా మ్రోగింది.

'వెళ్తా_నహో...కూక్' తనకు తానే బహుపరాకుగా బయలు దేరింది రైలు

ఒక మైలు తర్వాత వచ్చిన మామిడి తోపుల్లో కూస్తున్న కోయిల కూత విన్పించింది రవికి. అతడు సీటునుంచి లేచి ద్వారం దగ్గరకు దూసుకుపోయాడు

కొండల మధ్యగా పయనిస్తోంది రైలు. తూరుపు కొండకు పడమటి కొండకు కట్టిన పవనాల ఉయ్యాలలో కోయిల కూత ఊగుతున్నట్టుగా అతనికి అన్పించింది.

రైలు చక్రంతో లయగలుపుతున్న తన చేతి గడియారపు ముల్లులా, కోయిల పాటలో వూగుతున్న లోయకు ప్రతిబింబంగా తన హృదయంలో ఎవరో ఊయల వూగుతున్నట్టు అతనికి తోచింది.

భౌతికంగా రవి పట్నం వైపు పరుగెడుతున్నా, అతని మనసు అంతకంటే వేగంగా తన వూరి వాగు ప్రక్కనున్న ఎలమావితోట వైపు పరుగెడుతోంది.

రైలు పరుగెత్తుతూనే వుంది.

[ అ యి పో యి ం ది ]

# ఎందుకో? ఎందుకో?

"క న్న"

కదలివచ్చే మొయిలు
పిల్ల తెమ్మెర సోక
జల్లు జల్లుగ సాగి
ఒళ్ళంతా తడిపింది

మేను తడిపిన సోన
జడివాన ఏదని
కనులెత్తి చూడగా
కనుమాటు చేసింది
కనబడక తొలిగింది.

కొమ్మ చిగురుల తాకి
పికము గొంతుక నూపి
కేకి చందము జూచి
పూల తావుల నూది
చెట్టు గుట్టలచేరి
చుట్టు చుట్టూ తిరిగి

ఏది నా ఎద మొయిలు
ఎటుపోయె నా చెలియ
అని వెదకు తెమ్మెర
ఒంటిగా వీచింది
మూగగా వేగింది.

వేగిపోయిన గొంతు
దప్పిగొని డస్సింది
ఊపిరాడని మొయిలు
ఉస్సురని ఊర్చింది.

వాడిపోయిన తీవ
రాలిపోయిన ఆకు
నల్లనైనా పూవు
ఎండి వ్రీలిన పృధివి
చూచినవి ఆర్తిగా
చిరుగాలి రాకకై
తెలిమబ్బు దున్కకై

అటుచూచి ఇటుచూచి
కాలమే కరుణింప
ఆకసం నవ్వింది
హరివిల్లు విరిసింది
ప్రియమార పలికింది

వేగిపోయిన గాలి
ఊపిగాడని మొయిలు
వేగమే కదిలాయి
జంకు గొంకూలేక
సిగ్గు బిడియము విడిచి.

కన్నె తెమ్మెర సొంపు
నీలి మేఘపు వంపు
కలిసేది ఎక్కడో ?
కరిగేది ఎప్పుడో ?
మరల విరిగేది ఎందుకో ?

